# మనవే'మన పద్యాలు

**ఆ. వె. తనువులోని యాత్మ తత్త్వ మెఱుంగక**
**వేరె కలడటంచు వెదుకడెపుడు**
**భానుడుండ దివ్వె పట్టుక వెదుకునా?**
**విశ్వదాభిరామ వినురవేమ!**

**అర్థములు** : తనువు = శరీరము.
భానుడు = సూర్యుడు.
దివ్వె = దీపము.

**తాత్పర్యము** : దేహమే దేవాలయము. ప్రతి జీవిలోనూ దైవాంశ ఉంటుంది. అయితే దైవాంశ ఎంత శాతము ఉన్నది అన్నదానిని ఆధారముగా ఆవ్యక్తిలో దివ్యత్వం ప్రకటితమౌతుంది. ఈ విషయమును గ్రహించిన విద్వాంసులు తమలోని ఆత్మస్వరూపాన్ని చూస్తారేగాని, వేరొకచోట (బయట ప్రపంచములో) వెతుకరు. సూర్యుడు చక్కగా ప్రకాశించుచుండగా గుడ్డిదీపముతో వస్తువులను అన్వేషించడము అజ్ఞానము.

**ఆ. వె. దాతకాని వాని దఱచుగా వేడిన**
**వాడు దాత యౌనె వసుధలోన**
**ఆరు దర్భయౌనె యబ్ధిలో ముంచిన**
**విశ్వదాభిరామ వినురవేమ!**

**అర్థములు** : దాత = దానగుణము కలవాడు.
తఱచుగా = మాటిమాటికి.
వేడిన = ప్రాధేయపడిన
వసుధ = భూమి.
ఆరు = అరిక గడ్డి.
దర్భ = దర్భ (పూజా సమయములలో వాడే ఒక రకమైన గడ్డి)
అబ్ధి = సముద్రము.

**తాత్పర్యము**: అరిక గడ్డిని సముద్రములో ముంచినను అది దర్భ కాబోదు. అటులనే దానము చేసే గుణము లేనివానిని పదే పదే దానమడిగినను అతడు దాత కాజాలడు. దాన బలము తెలియనివాడు అతడు దాత కాజాలడని అర్థము.

*(ఇందులో కొంత భాగము స్వామి చిదాత్మానందగారి 'వేమన పద్యములు - అంతరార్థము' ప్రవచనములలో ఒంట పట్టించుకున్న సారాంశము. పూజ్య శ్రీ స్వామి చిదాత్మానంద గారికి ధన్యవాదములతో...)*